ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -74 పేజీలు - 06 వెల - 04/- మంగళవారం 24 మార్చి 2026

# ఉక్కు శకానికి నాంది



## అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన



### 20 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ ను తీసుకొచ్చాం...

- రెండు దశల్లో 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయనున్న పరిశ్రమ
- 20 నెలల్లోనే ప్రాజెక్టును సాకారం చేశామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అనకాపల్లి,మార్చి 23 ఆంధ్ర ప్రగతి**

ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో సరికొత్త చరిత్ర రాయబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో విశాఖ ఉక్కు కంటే అతిపెద్ద ప్లాంట్ రాబోతోందని, సోమవారం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు భూమి పూజ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు.

మిగతా 2లో.

### బాబు విజన్ వల్లే పెట్టుబడులు

- ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో పవన్
- ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్
- రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటుపై హర్షం





# 5 రోజులు యుద్ధాన్ని ఆపేస్తున్నాం

- : డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన
- 5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన
- ఇరాన్, అమెరికా మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని వెల్లడి
- ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపేస్తున్నామని ప్రకటన

**న్యూఢిల్లీ,మార్చి 23 ఆంధ్ర ప్రగతి**

పశ్చిమాసియాలో యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌పై యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నామని ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నామని వెల్లడించారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులుగా ఇరాన్‌తో జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని పేర్కొన్నారు.

మిగతా 2లో.



# యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు

- ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి
- లోక్‌సభలో ప్రధాని మోదీ వెల్లడి

**న్యూఢిల్లీ,మార్చి 23 ఆంధ్ర ప్రగతి**

పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొ చ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్ సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా

మిగతా 2లో.





2లో.

# రైలు ప్రమాదాలకు కవచ్ అడ్డుకట్ట..

- కీలక మార్గంలో సేవలు ప్రారంభం
- ఢిల్లీ-హౌరా కారిడార్‌లో అందుబాటులోకి వచ్చిన 'కవచ్' వ్యవస్థ
- ప్రయాగ్‌రాజ్-కాన్పూర్ మధ్య 190 కిలోమీటర్ల మేర సేవలు ప్రారంభం
- ప్రమాదాలను నివారించి, గంటకు 160 కి.మీ. వేగాన్ని సాధ్యం చేసే టెక్నాలజీ

# ఎల్పీజీకి బదులు పీఎన్జీ!



- సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా పీఎన్జీ వినియోగాన్ని పెంచాలని ఆదేశం
- ప్రతి ఇంటికీ పైప్డ్ గ్యాస్ కనెక్షన్ ఇచ్చేలా కార్యాచరణకు సూచన
- అకాల వర్షాల పంట నష్టంపై మార్చి 26 లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశం

**అమరావతిమార్చి 23 ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో నెలకొన్న సమస్యలను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగంపై దృష్టి సారించడమే సరైన మార్గమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ అందించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం

మిగతా 2లో.

# విద్వేషపూరిత ప్రసంగాలు, నేరాల నిరోధక బిల్లుకు

## తెలంగాణ మంత్రివర్గం ఆమోదం

- పేరెంట్స్ సామాజిక భద్రత బిల్లుకు ఆమోదం
- తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోకుంటే వేతనాల్లో కోత


2లో.

# దమ్ముంటే జగనే సమాధానం చెప్పాలి

- కుటుంబ ఆస్తుల వివాదంపై స్పందించిన వైఎస్ షర్మిల
- వివేకా హత్య కేసును పక్కదారి పట్టించేందుకే ఈ గొడవ అని ఆరోపణ
- దమ్ముంటే జగనే నేరుగా మాట్లాడాలంటూ సవాల్
- విజయమ్మ లేఖలోని సంతకం నిజమని.. వైసీపీ ప్రచారం అబద్ధమని వెల్లడి
- వైసీపీ నేతలపై అత్యంత కఠిన పదజాలంతో విరుచుకుపడ్డ షర్మిల



**అమరావతి ఆంధ్ర ప్రగతి**

తమ కుటుంబ ఆస్తుల వివాదంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. తన సోదరుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. వివేకానంద రెడ్డి హత్య కేసును పక్కదారి పట్టించేందుకే వైసీపీ నేతలు ఆస్తుల వివాదాన్ని తెరపైకి

మిగతా 2లో.

# 'బియ్యం' రాజకీయం



- ఎగుమతులపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు..
- దీటుగా బదులిచ్చిన మంత్రి ఉత్తమ్!
- సీబీఐ, ఐడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తిని అడ్వైజర్ గా ఎలా నియమించుకుంటారని హరీశ్ ప్రశ్న
- ఎగుమతులు 22,750 టన్నుల వద్దే ఎందుకు నిలిచిపోయాయని ప్రశ్న
- హరీశ్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్న ఉత్తమ్
- ఎగుమతుల్లో ప్రేమ్ చంద్ కు సంబంధం లేదని వ్యాఖ్య

**హైదరాబాద్ మార్చి 23 ఆంధ్ర ప్రగతి**

రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో బియ్యం ఎగుమతుల్లో భారీ కుంభకోణం జరిగిందంటూ తెలంగాణ అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన ఆరోపణలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. వేల కోట్ల బ్యాంక్ ఫ్రాడ్, బంగారం స్మగ్లింగ్ వంటి సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్ అనే వ్యక్తిని ప్రభుత్వానికి అడ్వైజర్‌గా ఎలా నియమించుకుంటారని ఆయన ఘాటుగా ప్రశ్నించారు.

మిగతా 2లో.



## 5 రోజులు యుద్ధాన్ని ఆపేస్తున్నాం

మొదటిపేజీ తరువాయి

"గత రెండు రోజులుగా అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. ఇరుదేశాల మధ్య జరిగిన చర్చల నేపథ్యంలో ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని ఆదేశించాను" అని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు.పశ్చిమాసియాలో తాము శాంతికోసం కృషి చేస్తామని ట్రంప్ తెలిపారు. మరోవారం రోజుల పాటు చర్చలు జరిగే అవకాశం ఉందని అన్నారు. చర్చల ఫలితంపై ఆధారపడి భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు.

## యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు

మొదటిపేజీ తరువాయి

వెనక్కి వచ్చారని మోదీ తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలో 60 శాతం ఒఖఉ ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వ్ ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ఎ÷-లాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను అని అన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత దేశాల్లో సీబీఎస్ఈ ఇప్పటికే 10, 12వ తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేసింది. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. అలాగే దేశీయంగా ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచుతున్నాం. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా జరిగేలా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాదారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. గతంలో 27 దేశాల నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకునేవాళ్లం. ఇప్పుడు ఆ సంఖ్య 41కి పెరిగింది. మనవద్ద ప్రస్తుతం 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయి. వీటిని 65 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా పెంచే దిశగా కృషి చేస్తున్నాం అని వివరించారు. ఇంధనంలో ఇథనాల్ కలపడాన్ని పెంచడం ద్వారా ఏటా ముడి చమురు దిగుమతులను 4.5 కోట్ల బ్యారెళ్ల మేర తగ్గించగలిగాం. ప్రభుత్వ, పారిశ్రామిక రంగాల సంయుక్త కృషితో.. ఈ సంక్షోభం వల్ల తలెత్తే సవాళ్లను దీటుగా ఎదుర్కోగలమనే నమ్మకం ఉంది. యూరియా, ఇతర ఎరువుల విషయంలో రైతులకు సాధ్యమైనంతమేర సాయం అందిస్తూనే ఉంటాం. చర్చలు, దౌత్యం ద్వారా పశ్చిమాసియా సంక్షోభానికి శాంతియుత పరిష్కారం సాధించేలా అన్ని పక్షాలను ప్రోత్సహిస్తున్నాం అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.

## అసెంబ్లీలో 'బియ్యం' రాజకీయం

మొదటిపేజీ తరువాయి

ఈ వ్యవహారంపై తక్షణమే 'హౌస్ కమిటీ' వేయాలని డిమాండ్ చేసిన హరీశ్ రావు... ప్రభుత్వం చెబుతున్న పది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి లక్ష్యం కేవలం 22,750 టన్నుల వద్దే ఎందుకు ఆగిపోయిందని నిలదీశారు.ఏడాది కాలంగా సుమారు 7,500 టన్నుల బియ్యం కాకినాడ పోర్టులో నిలిచిపోయి పురుగులు పడుతున్నాయని, వాటాల బేరసారాలు కుదరకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన ఆరోపించారు. ఒకవేళ ప్రభుత్వం పారదర్శకంగా ఉంటే తాము చేసే ఆరోపణలపై విచారణకు సిద్ధపడాలని సవాల్ విసిరారు.హరీశ్ రావు చేసిన ఈ ఆరోపణలను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తిప్పికొట్టారు. ఇవన్నీ కేవలం నిరాధారమైన ఆరోపణలని, ప్రతిపక్ష నేతలు సిఫార్సు చేసిన వారికి పదవులు దక్కలేదనే అక్కసుతోనే సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. హరీశ్ రావు ప్రస్తావించిన ప్రేమ్ చంద్ గార్గ్‌కు ఫిలిప్పీన్స్ బియ్యం ఎగుమతులకు ఎటువంటి సంబంధం లేదని, ఇది పూర్తిగా తెలంగాణ, ఫిలిప్పీన్స్ ప్రభుత్వాల మధ్య జరిగిన అధికారిక ఒప్పందమని స్పష్టం చేశారు. ఫిలిప్పీన్స్‌లో నెలకొన్న రాజకీయ సంక్షోభం కారణంగానే ఎగుమతుల్లో కొంత జాప్యం జరిగిందని, అయితే అక్కడ అన్ని దిగుమతులపై ఆంక్షలు ఉన్నప్పటికీ కేవలం తెలంగాణ బియ్యానికి మాత్రమే మినహాయింపు లభించిందని వివరించారు. కేవలం ఒక షిప్‌మెంట్ మాత్రమే కాకినాడ పోర్టులో నిలిచిపోయిందని, అంతకు మించి అక్రమాలు ఏవీ జరగలేదని మంత్రి సభలో స్పష్టమైన వివరణ ఇచ్చారు.

## రైలు ప్రమాదాలకు కవచ్ అడ్డుకట్ట..

న్యూఢిల్లీ,మార్చి 23 ఆంధ్ర ప్రగతి

రైలు ప్రయాణాన్ని మరింత సురక్షితంగా, వేగవంతంగా మార్చే దిశగా భారతీయ రైల్వే కీలక ముందడుగు వేసింది. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీ-హౌరా కారిడార్‌లోని ప్రయాగ్‌రాజ్-కాన్పూర్ సెక్షన్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ రైలు భద్రతా వ్యవస్థను సోమవారం విజయవంతంగా ప్రారంభించినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

ప్రయాగ్‌రాజ్, కాన్పూర్ మధ్య సుమారు 190 కిలోమీటర్ల మార్గంలో ఈ వ్యవస్థను యాక్టివేట్ చేశారు. రైలు నంబర్ 14163 ద్వారా ఈ వ్యవస్థను అమలులోకి తీసుకురాగా, జనరల్ మేనేజర్ స్వయంగా సుబేదార్‌గంజ్ నుంచి మనౌరీ స్టేషన్ వరకు ఫుట్‌ప్లేట్ తనిఖీ నిర్వహించి పనితీరును సమీక్షించారు. డివిజనల్, హెడ్ క్వార్టర్స్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'కవచ్' వ్యవస్థ, మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలను నివారించడానికి రూపొందించబడింది. లోకో పైలట్ పొరపాటున రెడ్ సిగ్నల్ దాటినా, ఈ వ్యవస్థ ఆటోమేటిక్‌గా బ్రేకులు వేసి రైలును నిలిపివేస్తుంది. రైలు వేగాన్ని, సిగ్నళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతను నిర్ధారిస్తుంది. ఈ వ్యవస్థతో గంటకు 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపడం సాధ్యమవుతుంది.తొలి దశలో చౌరీ చౌరా ఎక్స్‌ప్రెస్‌తో సహా 8 జతల రైళ్లకు ఈ సేవలను అందిస్తారు. రాబోయే నెలల్లో వందే భారత్ సర్వీసులతో పాటు మరిన్ని రైళ్లకు దీన్ని విస్తరించనున్నారు. ఈ వ్యవస్థను ప్రారంభించడానికి ముందు, రైల్వే శాఖ విస్తృతమైన ట్రయల్స్ నిర్వహించింది. వ్యాప్-7 ఇంజిన్లు, ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, 20 కోచ్‌ల వందే భారత్ రైలుతో ట్రయల్స్ జరిపి, విశ్వసనీయతను నిర్ధారించుకున్నారు. 20,000 కిలోమీటర్లకు పైగా ప్యాసింజర్ ట్రయల్స్ కూడా ఎలాంటి సమస్యలు లేకుండా విజయవంతంగా పూర్తిచేశారు.ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఢిల్లీ-ముంబై, ఢిల్లీ-హౌరా కారిడార్‌లలోని కీలక సెక్షన్లతో కలిపి 1,450 కిలోమీటర్ల మార్గంలో 'కవచ్' వెర్షన్ 4.0ను ఏర్పాటు చేశారు. 'మిషన్ రఫ్తార్'లో భాగంగా తదుపరి దశలో ఘజియాబాద్-తుండ్లా సెక్షన్‌లో ఈ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

## విద్వేషపూరిత ప్రసంగాలు, నేరాల నిరోధక బిల్లుకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం

హైదరాబాద్ మార్చి 23 ఆంధ్ర ప్రగతి

తెలంగాణ మంత్రివర్గం కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు బిల్లులకు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా విద్వేషపూరిత ప్రసంగాలు, విద్వేషపూరిత నేరాల నిరోధక బిల్లును (హేట్ స్పీచ్) మంత్రివర్గం ఆమోదించింది. మతసామరస్యానికి భంగం కలిగించే పోస్టులు, అల్లర్లు, ఘర్షణలను ప్రేరేపించే ప్రసంగాలను కట్టడి చేసేందుకు ఈ బిల్లును రూపొందించారు.దీనితో పాటు సామాజిక భద్రత, కార్మిక సంక్షేమం మరియు మౌలిక సదుపాయాల కల్పన ధ్యేయంగా ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు పిల్లలు మద్దతుగా ఉండాలనే లక్ష్యంతో పేరెంట్స్ సామాజిక భద్రత బిల్లుకు కూడా ఆమోదం తెలిపింది. తల్లిదండ్రులను సరిగ్గా ఆదరించని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల్లో కోత విధించాలని నిర్ణయించారు. వారి వేతనం నుంచి 15 శాతం లేదా రూ.10 వేలు నేరుగా తల్లిదండ్రులకు అందేలా చట్టం తీసుకురానున్నారు.ఎల్ అండ్ టీ నుంచి హైదరాబాద్ మెట్రో స్వాధీన ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రభుత్వపరంగా జరగాల్సిన లావాదేవీల నిర్వహణ బాధ్యతను హెచ్ఎంఆర్ఎల్‌కు అప్పగించారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణనపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి కమిటీ సమర్పించిన నివేదికను మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం, న్యాయవాదుల రక్షణ కోసం తీసుకువచ్చే బిల్లులకు ఆమోదం తెలిపింది.

# ఉక్కు శకానికి నాంది

మొదటిపేజీ తరువాయి

అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'ప్రపంచానికి ఏపీ సత్తా చాటిచెప్పే ప్రాజెక్ట్ ఈ స్టీల్‌ప్లాంట్. ప్రధాని మోదీ సహకారంతోనే ప్లాంట్ ఏర్పాటు సాధ్యమైంది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో మంత్రి లోకేశ్ కృషి ఎంతో ఉంది. అన్నివిధాలా సహకరిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయి. ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్. అని అన్నారు. ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో కొత్తచరిత్ర లిఖిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకంటే.. అతిపెద్ద పరిశ్రమ రాజయ్యపేటలో ఏర్పాటు కాబోతోందన్నారు. ఆర్సెలార్ మిత్తల్ పెట్టుబడిని గొప్ప మలుపుగా అభివర్ణించారు. భారత్‌లోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నక్కపల్లిలో ఏర్పాటు కాబోతోంది. ప్రపంచంలోనే నెంబర్‌వన్ ఉక్కు పరిశ్రమగా ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ కాబోతోంది. కేంద్రం సహకారం ఉండటం వల్లే ఈ ప్లాంట్ సాధ్యమవుతోందని అన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన చేస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీలను 20 నెలల్లో పూర్తి చేశాం. ఏ పని తలపెట్టినా బేషరతుగా మద్దతిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ఈ ప్రాజెక్టు తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేసిన లోకేశ్‌కు అభినందనలు. 5,465 ఎకరాల్లో ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తాం. ఇవాళ స్టీల్‌ప్లాంట్‌కే కాదు.. స్టీల్ సిటీకి పునాది వేశాం. 2028 డిసెంబర్ నుంచి స్టీల్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ ప్లాంట్ ద్వారా ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు వెళ్తున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రికార్డు స్థాయిలో భూ సేకరణ చేశాం అని అన్నారు. దేశంలోనే పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానం. ఏపీలో ఉన్నన్ని వనరులు ఎక్కడా లేవు. అద్భుత విజయాలకు పెట్టుబడిదారులు ఏపీని కేంద్రంగా చేసుకోవాలి. ఇప్పటికే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మూడేళ్లలో 22 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. విశాఖను ప్రపంచస్థాయి నగరంగా చేస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతిని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. రేర్ ఎర్త్ మినరల్స్ హబ్‌గా విశాఖ తయారవుతుందని చంద్రబాబు అన్నారు. ఏపీలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందిస్తున్నాం. కేంద్రం సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతోంది. ప్లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులకు రుణపడి ఉంటాం. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. క్వాంటమ్ వ్యాలీకి కేరాఫ్‌గా అమరావతి మారబోతోంది. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజలకు అధిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆర్సెలార్ పెట్టుబడులు తమలో విశ్వాసం మరింత పెంచాయని అన్నారు. చంద్రబాబు వంటి దార్శనిక నేత ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, చంద్రబాబు వల్లే ఏపీకి పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా కూడా చెప్పారని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. భూమిపూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీలో పెట్టుబడులు పెడుతున్న స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ద్వారా లక్షమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అధికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. 'ఆర్సెలార్ స్టీల్‌ఎ÷-లాంట్ పెట్టుబడులు మాలో విశ్వాసాన్ని పెంచాయి. పెట్టుబడులు రావాలంటే దార్శనికత ఉన్న నేత కావాలని ఎన్నికల్లో చెప్పాను. లక్ష్మీ మిత్తల్‌ను ఒప్పించి పెట్టుబడులు తీసుకురావాలంటే చంద్రబాబు వల్లే సాధ్యం. రాజకీయ ధురంధరుడు చంద్రబాబు వల్లే పెట్టుబడులు



వస్తున్నాయి. అదే విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా చెప్పారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ఎ÷-లాంట్ ఏర్పాటు కాబోతోందని పవన్ కల్యాణ్ తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని 2019లోనే ఆదిత్య మిట్టల్‌ను కోరామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. 2024లో అధికారంలోకి రాగానే స్టీల్‌ఎ÷-లాంట్ కోసం ప్రయత్నాలు చేశామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు గమ్యస్థానమన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ప్రపంచ పటంలో అనకాపల్లి ఉంటుందని వెల్లడించారు. ఎ÷-లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. పెట్టుబడిదారుల్లో సీఎం చంద్రబాబు విశ్వాసం నింపారని, ప్లాంట్‌కు కేంద్రమంత్రి కుమారస్వామి వేగంగా అనుమతులు ఇచ్చారని లోకేశ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనే ఏపీ ప్రజలకు మేలు జరుగుతుందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. లోకేశ్ తండ్రికి తగ్గ తనయుడంటూ ప్రశంసించారు. నారా లోకేశ్ మంచి భవిష్యత్తు ఉన్న నాయకుడన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఉక్కు రంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. విశాఖ ఉక్కును ఆర్థికంగా ఆదుకున్నామని వెల్లడించారు. చంద్రబాబు శ్రద్ధ, చొరవతో ఏపీ శరవేగంగా దూసుకుపోతోందని కేంద్ర మంత్రి కుమారస్వామి అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ వల్ల ఏపీ ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు ఆర్థికంగా మద్దతిచ్చాం. విశాఖ ఉక్కు పరిశ్రమలో ఉత్పత్తి పెంచేలా చర్యలు చేపట్టాం అని అన్నారు.

# దమ్ముంటే జగనే సమాధానం చెప్పాలి

మొదటిపేజీ తరువాయి

తెస్తున్నారని ఆమె మండిపడ్డారు. తన తల్లి వైఎస్ విజయమ్మ విడుదల చేసిన లేఖలోని ప్రతి అక్షరం నిజమని, దమ్ముంటే ఆ లేఖపై జగనే నేరుగా మాట్లాడాలని సవాల్ విసిరారు. సోమవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ, వైసీపీ నేతలపై అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### ఆస్తుల కోసం కాదు.. న్యాయం కోసమే పోరాటం

వివేకానంద రెడ్డిది హత్య అని తాను నిజం మాట్లాడటమే నేరమైందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. "నిజం చెప్పినందుకే నాపై ఇంతగా విరుచుకుపడుతున్నారు. వివేకా హత్య కేసులో సాక్షి మీడియా ఏడు గంటల పాటు గుండెపోటు అని ఎందుకు ప్రచారం చేసిందో చెప్పే ధైర్యం వైసీపీ నేతలకు లేదు. దానికి సమాధానం చెప్పాల్సింది అవినాష్ రెడ్డి, సాక్షిని నడుపుతున్న భారతీ రెడ్డి. ఆ విషయంపై మాట్లాడలేక, ఆస్తులంటూ కొత్త వివాదాన్ని సృష్టిస్తున్నారు," అని షర్మిల విమర్శించారు.

తాను ఆస్తుల కోసం పాకులాడుతున్నట్టు, చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారినట్టు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. తన పోరాటం ఆస్తుల కోసం కాదని, ఒకవేళ అదే తన అజెండా అయితే తెలంగాణలో కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోనే పార్టీ పెట్టేదాన్నని స్పష్టం చేశారు. జగన్‌తో తాను సంతకం చేసిన ఎంఓయూ పత్రాలను ఇన్నాళ్లూ కోర్టుకు సమర్పించలేదని, కేవలం జగన్ తన తల్లిపై కేసు వేయడం వల్లే ఆ పత్రాలు బయటకు వచ్చాయని వివరించారు.

### విజయమ్మ లేఖ వాస్తవం.. దమ్ముంటే కాదనమనండి

తన తల్లి విజయమ్మ విడుదల చేసిన లేఖపై వైసీపీ సైతాన్ సైన్యం చేస్తున్న దుష్ప్రచారాన్ని షర్మిల తిప్పికొట్టారు. "విజయమ్మ అంటే రాజశేఖర్ రెడ్డి గారిలో సగం. ఆయన ఆశయాలకు సజీవ రూపం. అలాంటి వ్యక్తి, నలుగురు బిడ్డలకు ఆస్తి సమానంగా పంచాలన్నది రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశమని, జగన్ అన్యాయం చేస్తున్నాడని లేఖలో స్పష్టంగా రాశారు. ఈ గోబెల్స్ ప్రచారం ఆపాలని కూడా చెప్పారు. ఇకనైనా డీసెన్సీ ఉన్నవాళ్లు ఎవరూ ఈ విషయం మాట్లాడరు. ఇంకా మాట్లాడుతున్నారంటే, మొరగడం కుక్కల నైజం అనుకోవాలి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ లేఖలోని సంతకం తన తల్లిది కాదని, ఒత్తిడితో పెట్టించానని వైసీపీ ప్రచారం చేస్తోందని, నిజంగానే ఆ సంతకం ఆమెది కాకపోతే విజయమ్మే స్వయంగా మీడియా ముందుకు వచ్చి ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. జగన్ అయినా తన తల్లితో మాట్లాడించి నిజానిజాలు చెప్పించొచ్చు కదా అని నిలదీశారు.

### దమ్ముంటే జగనే మాట్లాడాలి

ఈ ఆస్తుల వివాదం పూర్తిగా వ్యక్తిగతమైనదని, దీనిపై మాట్లాడాల్సింది జగన్మోహన్ రెడ్డి అని షర్మిల అన్నారు. "ఇది జగన్ వ్యక్తిగత, ఆస్తులకు సంబంధించిన విషయం. దీనిపై ఆయన పార్టీ నేతల చేత, సోషల్ మీడియా సైన్యం చేత ఎందుకు మాట్లాడిస్తున్నారు? రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశం, ఇద్దరం కలిసి సంతకాలు చేసిన ఎంఓయూ గురించి తెలిసిన జగన్ మాట్లాడాలి కదా? అంటే, ఆయనకు మాట్లాడే దమ్ము లేక ఇతరుల వెనుక దాక్కుంటున్నారని అనుకోవాలా?" అని షర్మిల ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రత్యేక హోదాను, పోలవరాన్ని తాకట్టు పెట్టి మోదీకి దత్తపుత్రుడిగా మారింది జగనేనని, తాను కాదని ఆమె ఆరోపించారు.

### వైసీపీ నేతలపై తీవ్ర వ్యాఖ్యలు

రాజశేఖర్ రెడ్డి ఆశయాల కోసమే తాను, తన తల్లి రాజకీయాల్లో ఉన్నామని, జగన్‌లా స్వార్థ రాజకీయాలు చేయడం లేదని షర్మిల అన్నారు. ఫ్రంట్ పేజీలో రాజశేఖర్ రెడ్డి గారి ఫోటో వేసుకుని సత్యమేవ జయతే అని చెప్పుకునే సాక్షి పత్రికకు నిజం పట్ల గౌరవం లేదని విమర్శించారు. జగన్‌కు నిజం వైపు నిలబడే ధైర్యం లేకపోవడం వల్లే తన పార్టీలోని నాయకులతో తనపై విమర్శలు చేయిస్తున్నారని షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వాళ్లను నాయకులు అనాలో, కుక్కలు అనాలో మీరే అనుకోండి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్నది జగనే అని, ఆయన దర్శకత్వంలోనే ఈ నాటకం నడుస్తోందని ఆమె ఆరోపించారు.

# ఎల్పీజీకి బదులు పీఎన్జీ!

మొదటిపేజీ తరువాయి

చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్పీజీ సరఫరా, అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం, టెక్నాలజీ వినియోగం వంటి అంశాలపై సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, గ్యాస్ సంక్షోభాన్ని విద్యుత్ రంగానికి ఒక అవకాశంగా మలుచుకోవాలని, ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్ల వంటి వాటి వాడకాన్ని ప్రజల్లో ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో పీఎన్జీ విస్తరణకు 2.34 లక్షల కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం 60 వేల మంది మాత్రమే వినియోగించుకుంటున్నారని అధికారులు వివరించగా.. దీనిని 100 శాతం వినియోగంలోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతి జిల్లాలో కనీసం 10 వేల కొత్త పీఎన్జీ కనెక్షన్లు ఇచ్చేలా లక్ష్యం నిర్దేశించారు.

నిలిచిపోయిన శ్రీకాకుళం - కాకినాడ పైప్‌లైన్ పునరుద్ధరణ కోసం కేంద్ర మంత్రికి తక్షణమే లేఖ రాయాలని చెప్పారు. ఏపీ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌కు అవసరమైన ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలన్నారు. వాణిజ్య రంగంలో సహజ వాయువు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 'నేచురల్ గ్యాస్ పాలసీ'ని వచ్చే కేబినెట్ సమావేశం ముందుకు తీసుకురావాలని స్పష్టం చేశారు. విద్యా సంస్థలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీలు, అన్న క్యాంటీన్లు, హోటళ్లకు ప్రాధాన్యతా క్రమంలో ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేయాలన్నారు. గత ఐదు రోజులుగా గృహావసరాలకు రోజుకు సగటున 1.80 లక్షల



సిలిండర్లు పంపిణీ చేస్తున్నామని, మరో 14,444 మెట్రిక్ టన్నుల గ్యాస్ నిల్వలు ఉన్నాయని అధికారులు సీఎంకు తెలిపారు.

### పంట నష్టంపై మార్చి 26లోగా నివేదిక

అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో జరిగిన పంట నష్టంపై ప్రాథమిక వివరాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 26వ తేదీలోగా పంట నష్టంపై పూర్తిస్థాయి అంచనాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో జీఎస్‌డీపీ 40 శాతం, ఉత్పాదన 71 శాతం పెరిగిన నేపథ్యంలో పంటల నిర్వహణ, పంటల మార్పిడిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

### పాలనలో టెక్నాలజీ వినియోగంపై ప్రశంస

టెక్నాలజీ వినియోగంతో అన్ని రంగాల్లో అద్భుత ఫలితాలు సాధించవచ్చని, దీనికి తిరుమలలో పెరిగిన దర్శనాల సంఖ్యే నిదర్శనమని ముఖ్యమంత్రి అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో తిరుమలలో క్యూలైన్ల నిర్వహణ మెరుగుపడిందని, భక్తుల నిరీక్షణ సమయం తగ్గి దాదాపు 20 శాతం అదనపు దర్శనాలు సాధ్యమయ్యాయని వివరించారు.

అత్యాధునిక ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటుతో ప్రసాదం నాణ్యత పెరిగిందని, భక్తులు, శ్రీవారి సేవకుల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని అన్నారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన శాఖలు కూడా మెరుగైన ప్రజా సేవల కోసం ఏఐ ఇంటిగ్రేషన్‌పై దృష్టి సారించాలని ఆదేశించారు.

ఐఓటీ పరికరాలు, సెన్సార్లు, సీసీటీవీల ద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో సాగు వ్యయం తగ్గించి, ఉత్పత్తి పెంచేలా చూడాలని, ఇందుకు పొరుగు రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. రాష్ట్రంలో బ్యాండ్ విడ్త్ పెంచాలని, ప్రభుత్వ శాఖలు డేటాను సమర్థంగా వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు.

ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# "మీ ఇంటికి మీ డాక్టర్" మొబైల్ మెడికల్ యూనిట్ ప్రారంభం.





**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 23:**
గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న "మీ ఇంటికి మీ డాక్టర్" వినూత్న ప్రాజెక్ట్‌లో భాగంగా మొబైల్ మెడికల్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి సోమవారం ప్రారంభించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ ఆవరణలో సుమారు రూ.1.20 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు వారి ఇంటి వద్దకే నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మొబైల్ మెడికల్ యూనిట్ మార్చి నుండి మే 2026 వరకు నంద్యాల జిల్లాలోని బండి ఆత్మకూరు మండలంలోని 15 గ్రామాల్లో సేవలు అందించనుందన్నారు. "మీ ఇంటికి - మీ డాక్టర్" ప్రాజెక్ట్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ సి ఎస్ ఆర్ నిధుల సహకారంతో అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం రూ.8.40 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ 01 మార్చి 2026 నుండి అమల్లోకి వచ్చి, మూడు సంవత్సరాల పాటు కొనసాగనుందన్నారు. ఈ ప్రాజెక్ట్ పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు (పాడేరు), నంద్యాల, పల్నాడు, తిరుపతి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అమలు చేస్తున్నారన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడం, శిశు మరణాల రేటు, మాతృ మరణాల రేటు తగ్గించడం, అంటువ్యాధుల నియంత్రణ, 100% టీకాకరణ సాధించడం వంటి లక్ష్యాలతో ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుందని కలెక్టర్ తెలిపారు.
ప్రతి మొబైల్ మెడికల్ యూనిట్‌లో ఒక వైద్యుడు, నర్సు, ఫార్మసిస్ట్, డ్రైవర్ ఉంటారని, వీరు గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించి ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాలు, ఎస్సీ/ఎస్టీ కాలనీలు, పేద కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు, మందులు అందిస్తారన్నారు. రోజుకు సుమారు 100 మందికి సేవలు అందించే ఈ యూనిట్, నెలకు 2000 మంది వరకు లబ్ధిదారులను చేరుకోగలదని కలెక్టర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నెలకు సుమారు 14,000 మంది, ఏడాదికి 2 లక్షల మంది, మూడు సంవత్సరాల్లో మొత్తం 6 లక్షల మందికి సేవలు అందించనున్నట్లు తెలిపారు. మార్చి నుండి మే 2026 వరకు వివిధ జిల్లాల్లోని ఎంపిక చేసిన మండలాల్లో ఈ ప్రాజెక్ట్ అమలు చేయబడుతుందని, ప్రాజెక్ట్ పర్యవేక్షణ కోసం జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక అమలు కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొంటూ, యువత స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో నివసించే పేదలకు ఉచిత వైద్య సేవలు అందేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, సాంకేతిక నైపుణ్య అభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు, రెడ్ క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త బురుజు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయాలి.

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 23:**
జిల్లాలోని డోన్ మండలంలోని కొత్త బురుజు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం అనంతరం అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 9వ తేదీన కొత్త బురుజు గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా, ఈ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యతను జిల్లా పరిపాలనకు అప్పగించిన విషయాన్ని ఆమె గుర్తుచేస్తూ, ప్రతి శాఖ సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఫంక్షనల్ హౌస్‌హోల్డ్ ట్యాప్ కనెక్షన్లు కల్పించాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. ఈ పనులకు సుమారు రూ. 30 లక్షల వ్యయం అవుతుందని అంచనా వేస్తూ, అవసరమైన అనుమతులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి, ఏప్రిల్ మొదటి వారంలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, గ్యాస్ కనెక్షన్లు లేని సుమారు 46 ఇళ్లకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసి, కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో




మరుగుదొడ్ల కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి, గ్యాప్ రిపోర్ట్ ఆధారంగా అవసరమైన చోట మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని తెలిపారు. గ్రామాన్ని స్వచ్ఛంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న చిన్న సిసి రోడ్డు పనులను కూడా ఆలస్యం లేకుండా పూర్తి చేసి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని ఆదేశించారు. కొత్త బురుజు గ్రామాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిర్దేశించిన గడువుల్లో పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 9వ తేదీన కొత్త బురుజు గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా, ఈ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యతను జిల్లా పరిపాలనకు అప్పగించిన విషయాన్ని ఆమె గుర్తుచేస్తూ, ప్రతి శాఖ సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఫంక్షనల్ హౌస్‌హోల్డ్ ట్యాప్ కనెక్షన్లు కల్పించాలని ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. ఈ పనులకు సుమారు రూ. 30 లక్షల వ్యయం అవుతుందని అంచనా వేస్తూ, అవసరమైన అనుమతులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి, ఏప్రిల్ మొదటి వారంలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, గ్యాస్ కనెక్షన్లు లేని సుమారు 46 ఇళ్లకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసి, కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో మరుగుదొడ్ల కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి, గ్యాప్ రిపోర్ట్ ఆధారంగా అవసరమైన చోట మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని తెలిపారు. గ్రామాన్ని స్వచ్ఛంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న చిన్న సిసి రోడ్డు పనులను కూడా ఆలస్యం లేకుండా పూర్తి చేసి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని ఆదేశించారు. కొత్త బురుజు గ్రామాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిర్దేశించిన గడువుల్లో పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# పథకాల అమలులో వేగం పెంచండి.

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 23:**
జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సేవల మెరుగుదల, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ అనంతరం పలు అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నందున, మున్సిపల్ కమిషనర్లు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి తిరుపతి, నాయుడుపేట ప్రాంతాల్లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యాలయాల్లో ఫైళ్ల నిర్వహణ, వాట్సాప్ సేవలు, కే పి ఐ డేటా ఎంట్రీలను మెరుగుపరచాలని, సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుంచి ప్రభుత్వ సేవలపై ప్రతికూల స్పందన వస్తోందని, దీనిని సరిచేసేందుకు అన్ని శాఖలు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్లు, ఆర్.ఓ.ఆర్ సేవలు, రోడ్ల మరమ్మతులు, రవాణా శాఖ సేవలు, గురుకుల పాఠశాలల పనితీరు మెరుగుపరచాలని ఆదేశించారు. వచ్చే గురువారం నాటికి 18 లక్షల డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, జిల్లా అధికారులు సమానంగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి




శాఖలో ప్రజా సంతృప్తి స్థాయి కనీసం 75 శాతం పైగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, గాలి వెలుతురు సమృద్ధిగా ఉండేలా పర్యవేక్షించాలని తెలిపారు. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ సేవలకు సంబంధించిన వాట్సాప్ నంబర్లపై విస్తృత ప్రచారం చేపట్టి, ప్రతి కార్యాలయంలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా కలెక్టరేట్‌కు తీసుకురాకుండా, ఆన్‌లైన్ లేదా 1100 నంబర్ ద్వారా పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా వడగాల్పుల నివారణ చర్యలు చేపట్టి, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద గ్రీన్ షేడ్ నెట్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను సూచించారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న అభ్యాసకుల ఫలితాలను తక్షణమే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 3,000 ఖాతాల్లో ఉన్న అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను గుర్తించి అభివృద్ధి పనులకు వినియోగించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటివరకు కేవలం 79 ఖాతాల నుండి రూ.48.72 లక్షలు మాత్రమే జమ అయినందున, మిగిలిన ఖాతాల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణాన్ని అభినందించిన కలెక్టర్, నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. సరైన క్యూరింగ్ లేకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆధునిక సాంకేతికతల వినియోగంతో రోడ్ల జీవితకాలాన్ని పెంచాలని సూచించారు. జిల్లాలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# సామాజిక న్యాయం కోసం పోరాడిన దొమ్మేటి వెంకటరెడ్డి

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 23:**
సామాజిక న్యాయం, విద్యా ప్రబోధం, అనగారిన వర్గాల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు దొమ్మేటి వెంకటరెడ్డి గారి స్పూర్తిని భావితరాలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆకాంక్షించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో దొమ్మేటి వెంకటరెడ్డి గారి 174వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, బీసీ సంక్షేమ అధికారి జగ్గయ్య, బీసీ కార్పొరేషన్ ఈడి జాకీర్ హుస్సేన్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దొమ్మేటి వెంకటరెడ్డి గారు శెట్టి బలిజ సమాజానికి చెందిన ప్రముఖ నాయకుడిగా, ఆ వర్గం హక్కుల కోసం బ్రిటిష్ పాలన కాలంలోనే పోరాడిన మహోన్నత వ్యక్తిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషి ఆదర్శప్రాయమని కొనియాడారు. విద్య ప్రాధాన్యతను ఎంతో ముందుగానే గుర్తించిన వెంకటరెడ్డి గారు, ముఖ్యంగా వయోజన విద్యకు ప్రోత్సాహం ఇచ్చి ప్రతి ఇంటికి అక్షరాస్యతను తీసుకెళ్లేందుకు కృషి చేశారని తెలిపారు. సామాజిక చైతన్యం, హక్కుల కోసం పోరాట స్పూర్తిని ప్రజల్లో నింపిన నాయకుడిగా ఆయన నిలిచారని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దొమ్మేటి వెంకటరెడ్డి గారి జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో, ముఖ్యంగా బీసీ సంక్షేమ శాఖ సమన్వయంతో నిర్వహించినట్లు తెలిపారు. దొమ్మేటి వెంకటరెడ్డి గారు ప్రస్తుత కోనసీమ జిల్లాలోని బోడసకుర్రు గ్రామంలో జన్మించినట్లు గుర్తుచేసి, కోనసీమ ప్రాంతంలో ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. బోడసకుర్రు - పాసర్లపూడి మధ్యనున్న వారధికి వెంకటరెడ్డి గారి పేరు పెట్టాలని స్థానికులు కోరుతున్నారని, ఆయనను శెట్టి బలిజ సమాజ పితామహుడిగా ప్రజలు గౌరవిస్తున్నారని తెలిపారు. ఆయన ఆశయాలు, సేవా భావం భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

**వంద రోజుల క్యాంపెయిన్ ద్వారా విస్తృత అవగాహన.**

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 23:** క్షయ వ్యాధి నిర్మూలనకు సమష్టిగా కృషి చేసి జిల్లాను క్షయ రహితంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంక, డిఎంహెచ్ఓ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల క్షయ (టిబి) వ్యాధి వస్తుందని తెలిపారు. ఈ బ్యాక్టీరియా ప్రధానంగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తూ, శరీరంలోని ఇతర భాగాలపై కూడా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. క్షయ వ్యాధిగ్రస్తుల నోటి నుండి వచ్చే లాలాజలపు చుక్కల ద్వారా ఈ వ్యాధి సులభంగా వ్యాపిస్తుందని, దగ్గు, తుమ్ము, మాట్లాడటం, పాడటం వంటి సందర్భాల్లో ఇతరులకు సోకే ప్రమాదం ఉంటుందని వివరించారు. అందువల్ల ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, దగ్గు వచ్చినప్పుడు నోరు మూయడం, అనుమానాస్పద లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్య సేవలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "క్షయ రహిత భారత్" కార్యక్రమంలో భాగంగా జిల్లా యంత్రాంగం మరియు ఆరోగ్య శాఖ సంయుక్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వంద రోజుల ప్రత్యేక క్యాంపెయిన్ ద్వారా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే, నిక్షయ పోషణ అభియాన్ కింద క్షయ రోగులకు పౌష్టికాహారం కోసం నెలకు రూ.1000 వరకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు వివరించారు. క్షయ నిర్ధారణ కోసం ఛాతీ ఎక్స్-రే, శ్లేష్మ పరీక్ష వంటి ప్రాథమిక పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 24న జరిగే ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని "జనభాగస్వామ్యంతో క్షయను అంతం చేద్దాం" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ కొరత లేదు - ఆందోళన అవసరం లేదు.

**అవసరానికి మించి బుకింగ్స్ చేయొద్దు. - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 23:**
జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని, ప్రజలు అనవసర ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం అనంతరం అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఇటీవలి అపోహల కారణంగా గ్యాస్ కొరత ఉందన్న ప్రచారం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని తెలిపారు. జిల్లాలో సాధారణంగా రోజుకు సుమారు



5,500 ఎల్‌పీజీ గ్యాస్ బుకింగ్స్ నమోదవుతుండగా, ప్రస్తుతం భయాందోళనల ప్రభావంతో ఆ సంఖ్య 10,000 వరకు పెరిగిందని పేర్కొన్నారు. అయితే సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, వినియోగదారులు అవసరానికి మించి బుకింగ్స్ చేయకుండా సహకరించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో ఇండక్షన్ స్టవ్‌ల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఇండక్షన్ స్టవ్‌ల లభ్యత, ధరలు తదితర వివరాలను సేకరించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్యాస్ కనెక్షన్ల విషయంలో కొన్ని ప్రాంతాల్లో ఎంపిడిఓలు, పంచాయతీ కార్యదర్శులు సమర్పించిన నివేదికల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించామని క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించి ఖచ్చితమైన వివరాలను సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు సరైన సమాచారం అందించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ క్షయ నివారణ దినోత్సవ పోస్టర్‌ను విడుదల చేసిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 23:**నంద్యాల మార్చి 24 న జరగనున్న 'ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం' పురస్కరించుకుని, నంద్యాలలోని మంత్రి కార్యాలయంలో సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సంబంధిత అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ క్షయ రహిత సమాజం దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి నిర్ధారణకు సంబంధించి గల్ల పరీక్ష, ఎక్స్-రే, సిబిఎన్ ఏ ఏ టి మరియు ఆర్ టి పి సిఆర్ వంటి ఆధునిక పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని మంత్రి ఫరూక్ తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్స సమయంలో పౌష్టికాహారం కోసం నెలకు రూ. 1000/- చొప్పున ప్రభుత్వం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తోందని, సాధారణ టీబీ మరియు మొండి టీబీ బాధితులకు అవసరమైన ఖరీదైన మందులను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోందని . 2 వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీని పూర్తిగా నయం చేయవచ్చని మంత్రి ఫరూక్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ, టీబీ,ఎయిడ్స్ నివారణ అధికారి శారద భాయ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు మరియు ఇతర సంబంధిత ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించండి.

**పిజిఆర్ఎస్ ద్వారా 206 దరఖాస్తుల స్వీకరణ.**

**రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 121 దరఖాస్తుల స్వీకరణ.**

**జిల్లా కలెక్టర్ శ్రీమతి జి.రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి, 23:** ప్రజా ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించి ఎప్పటికప్పుడు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంక, డిఆర్ఓ రామునాయక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగవంతంగా వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఓపెన్ చేసి చూస్తూ ఉండాలని పలుమార్లు ఆదేశించినప్పటికీ ఇంకా 104 దరఖాస్తులు ఓపెన్ చేసి చూడకపోవడం విచారకరమన్నారు. రీఓపెన్ దరఖాస్తులకు సంబంధించి ఇంకా 305 దరఖాస్తులు రీఓపెన్ చేయడం జరిగిందని వాటిపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధుల ద్వారా వచ్చే



వినతులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటికి తొలి ప్రాధాన్యంతో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 121 అర్జీల స్వీకరణ

భూ సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ క్లినిక్స్ ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 121 దరఖాస్తులు స్వీకరించగా వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 9, అడంగల్ సవరణలకు సంబంధించినవి 24, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి 12, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించినవి 29, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించినవి 14, సర్వే, రీ-సర్వేలకు సంబంధించినవి 30, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి 3 గా ఉన్నాయని కలెక్టర్ వివరించారు.

1) సిరివెళ్ల మండలం, ఎర్రగుంట్ల గ్రామంలో రహదారి నిర్మాణం కోసం స్థలం కేటాయించడం జరిగిందని, అందులో సగభాగం రోడ్డు కూడా నిర్మించడం జరిగిందని మిగతా రోడ్డు నిర్మాణ సమయంలో సదరు రహదారి నిర్మాణానికి కేటాయించిన భూమి తమదని నిర్మాణం జరగకుండా కంపచెట్లు అడ్డుగా వేయడం జరిగిందని, సదరు అంశాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సిరివెళ్ల తహశీల్దార్, ఎంపిడిఓలను కలెక్టర్ ఆదేశించారు.

2) బనగానపల్లె గ్రామం, పెరుసోమల గ్రామానికి చెందిన రాహుల్ పవర్ గ్రిడ్ సంస్థ వారు గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండా బ్లాస్టింగ్ చేస్తున్నారని జిల్లా కలెక్టర్ అర్జీ సమర్పించగా అందుకు సంబంధించిన అనుమతులను పరిశీలించడంతో పాటు నష్టపరిహారం కోసం కూడా ఎక్కువ శాతం రైతులు దరఖాస్తు చేసుకోవడం జరుగుతోందని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని బనగానపల్లె ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. 3) నంద్యాల మండలం అయ్యలూరు గ్రామానికి చెందిన జి.పద్మావతి తనకు పిఎం కిసాన్ పథకం క్రింద జమ కావాల్సిన నగదు జమ కాలేదని అందుకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించారు.

# ప్రజా దర్బార్‌లో ఫిర్యాదు.. వెనువెంటనే యాక్షన్.

**బాధితులకు 12 తులాల బంగారాన్ని అప్పగించిన వన్ టౌన్ పోలీసులు.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 23:**నంద్యాల పట్టణంలో చాబోలుకు చెందిన ఒక కుటుంబం పోగొట్టుకున్న 12 తులాల బంగారాన్ని వన్ టౌన్ పోలీసులు అత్యంత వేగంగా స్పందించి రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. చాబోలు గ్రామానికి చెందిన షేక్ శాలినా తన భర్త, పిల్లలతో కలిసి ఈరోజు ఉదయం బైక్‌పై నంద్యాల వన్ టౌన్ పరిధిలోని నడిగడ్డలో ఉన్న తన చెల్లెలి ఇంటికి బయలుదేరారు. తమ వెంట ఒక బ్యాగులో బట్టలు మరియు 12 తులాల బంగారాన్ని ఉంచుకున్నారు. అయితే, ప్రయాణంలో వన్ టౌన్ పరిధిలోకి రాగానే వారు గమనించకుండానే ఆ బంగారు నగలున్న బ్యాగ్ కింద పడిపోయింది. బంగారం పోయిందని గుర్తించిన బాధితులు హుటాహుటిన నంద్యాలలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో జరుగుతున్న 'ప్రజా దర్బార్' కు చేరుకుని, రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని కలిసి ఫిర్యాదు చేశారు. బాధితుల పరిస్థితిని చూసి చలించిన మంత్రి గారు తక్షణమే స్పందించి వెంటనే వన్ టౌన్ సీఐ సుధాకర్ రెడ్డికి ఫోన్ చేసి, ఘటనపై పూర్తి వివరాలు అందించి, గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధితులు కూడా పోలీసులను సంప్రదిస్తారని సమాచారం అందించారు. మంత్రి ఫరూక్ ఆదేశాలతో రంగంలోకి దిగిన సీఐ సుధాకర్ రెడ్డి మరియు వారి సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం మరియు క్షేత్రస్థాయి విచారణ ద్వారా అతి తక్కువ సమయంలోనే పోగొట్టుకున్న బంగారాన్ని కనుగొన్నారు. స్వాధీనం చేసుకున్న 12 తులాల బంగారాన్ని సీఐ గారు బాధితులకు అప్పగించారు. పోగొట్టుకున్న సొత్తును తిరిగి పొందిన బాధితులు ఆనందంతో మంత్రి ఫరూక్ కి మరియు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సమర్థవంతంగా పనిచేసి నగలను స్వాధీనం చేసుకున్న నంద్యాల వన్ టౌన్ సీఐ సుధాకర్ రెడ్డి ని, వారి సిబ్బందిని మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రత్యేకంగా అభినందించారు.

## జాబ్ మేళాల ద్వారా యువతకు విస్తృత ఉద్యోగావకాశాలు

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 23:**జిల్లాలో నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం, నంద్యాలలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మార్చి 25న నంద్యాల పట్టణంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ షాదీ ఖానాలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, హెచ్‌క్యూహెచ్‌సీఎస్, యూనిసాఫ్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, డీపీ చాక్లెట్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా రిడ్ ప్రైవేట్ లిమిటెడ్, యాక్సిస్ బ్యాంక్, చోళమండలం గోల్డ్ లోన్స్, టాటా ఎలక్ట్రానిక్స్, పుష్కల్ ఆగ్రోటెక్ లిమిటెడ్, డిక్సన్ టెక్నాలజీస్, జీపీఎస్ రెన్యువబుల్ ఎనర్జీ, అంబర్, వోల్టాస్ లిమిటెడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థల హెచ్ఆర్ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, బి/డి/ఎం ఫార్మసీ మరియు పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్ మేళా ద్వారా కనీసం 1500 ఉద్యోగాలను భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఎక్సైజ్ చట్టం ప్రకారం పునరావాసం పొందుతున్న విద్యార్థులు కూడా జాబ్ మేళాలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను సూచించారు. జాబ్ మేళాకు సంబంధించిన వివరాల కోసం 9182217075, 8297812530 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని, లేదా **naipunyam.ap.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డీఆర్ఓ రాము నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తోగట ప్రియాంక, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి కళ్యాణి, సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరు సుబ్బారాయుని సన్నిధిలో ఉమ్మడి జిల్లా విజిలెన్స్ ఎస్పీ పూజలు..!

**..ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల సురేష్ శర్మ.**



**ఆంధ్ర ప్రగతి పాణ్యం మార్చి 22:** ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసి యున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధిలో కర్నూలు ఉమ్మడి జిల్లా విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి ఐపీఎస్ అధికారి ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ శర్మ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ స్వామివారికి అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వ మంటపము నందు ఆమెను పూలమాలలు, శేష వస్త్రములతో ఘనంగా సత్కరించి, స్వామివారి చిత్ర పటము, ప్రసాదము అందజేశారు ఈ కార్యక్రమంలో కుమారుడు, బంధువులు, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




## వైయస్సార్ నగర్ లో ఫుడ్ పాయిజన్ కలకలం..!

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 23:**

నంద్యాల పట్టణంలోని38వ వార్డ్ వైయస్ నగర్ బుడగ జంగాల కాలనీలో ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో దాదాపు 80 మంది వరకు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రితో పాటు వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఈ ఘటనపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ మరియు డిఎంహెచ్ఓ వెంకటరమణ ఆసుపత్రులను సందర్శించి బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొంతమంది బాధితుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలపై విచారణ కొనసాగుతోందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రాంతంలో పరిశుభ్రత చర్యలు మరింత బలోపేతం చేయాలని సూచించారు.



## మహిళా దినోత్సవ విజేతలకు ఘన సన్మానం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 23:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల డివిజన్ అసిస్టెంట్ పోలీస్ అధికారి మంద జావలి ఆల్ఫన్స్ (ఐపీఎస్) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేసి, వారి ప్రతిభను అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ సమాజానికి మార్గదర్శకులవుతున్నారని తెలిపారు. మహిళల సాధికారతకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ ప్రసాద్ సతీమణి ఎల్. ఆది లక్ష్మమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

## గేట్ 2026 ఫలితాలలో అఖిల భారత ర్యాంకు166 సాధించిన దేరెడ్డి చంద్ర ప్రకాష్ రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 23:**

నంద్యాల జిల్లా, పాణ్యం మండలం, బలపనూరు గ్రామానికి చెందిన దేరెడ్డి మురళీధర్ రెడ్డి రెండవ కుమారుడు దేరెడ్డి చంద్ర ప్రకాష్ రెడ్డి గేట్ 2026 పరీక్ష ఫలితాలలో అఖిలభారత ర్యాంకు 166 గేట్ స్కోరు 857 సాధించారు. వంద మార్కుల గాను 73.35% మార్కులతో కంప్యూటర్ సైన్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సిఎస్ నందు ఘన విజయం సాధించారు. ఈఅద్భుతమైన ర్యాంకుతో టాప్ ఐఐటి లు బాంబే, కాన్పూర్, ఖరగ్పూర్, మరియు ఐఐఎస్సీలో (ఐ ఐ ఎస్ సి) ఎంటెక్ / ఎంఎస్,ఎంటెక్ మరియు ఎమ్మెస్ ల లో సీటు పొందే అవకాశాలు ఉన్నాయి అగ్రసేనిలో కూడా ఉద్యోగం వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి దాదాపు అన్ని పాత ఐఐటీలలో స్పెషలైజేషన్ను బట్టి అడ్మిషన్ పొందే అవకాశం ఉన్నది. ఈ సందర్భంగా పలువురు దేరెడ్డి చంద్ర ప్రకాష్ రెడ్డి మంచి ర్యాంకు సాధించడంతో కుటుంబ సభ్యులు బంధుమిత్రులు, స్నేహితులు ఆయనను అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి.

**..మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 23:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈరోజు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నిర్వహించిన "ప్రజా దర్బార్" కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వేదిక ద్వారా పలువురు తమ సమస్యలను మంత్రి ఫరూక్ దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మంత్రి ఫరూక్ స్వయంగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆయన తక్షణమే ఆయా సమస్యలకు సంబంధించిన శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. నంద్యాల నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం తరపున, తెలుగుదేశం పార్టీ తరపున నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 24 మార్చి 2026

# కరిమద్దుల రైతుల సాగునీటి సమస్యపై మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ తక్షణ స్పందన.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 23:** నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం గడివేముల మండల పరిధిలోని కరిమద్దుల గ్రామ రైతులకు ఎదురవుతున్న సాగునీటి సమస్యపై రాష్ట్ర న్యాయ శాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సానుకూలంగా స్పందించారు. సోమవారం నాడు నంద్యాలలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కరిమద్దుల గ్రామస్తులు, రైతులు మంత్రి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ పొలాలకు నీరు అందక పడుతున్న ఇబ్బందులను, సాగునీటి ఎద్దడిని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.రైతుల సమస్యలను విన్న వెంటనే స్పందించిన మంత్రి ఫరూక్ అక్కడికక్కడే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తో ఫోన్లో మాట్లాడారు. కరిమద్దుల రైతుల సమస్యను వివరించి, సాగునీటి విడుదలపై చర్చించారు. అనంతరం సాగునీటి శాఖ సీఈ కబీర్ భాష గారితో మాట్లాడి, క్షేత్రస్థాయిలో ఉన్న సాంకేతిక ఇబ్బందులను తొలగించి త్వరితగతిన రైతులకు నీరు అందేలా చూడాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, కరిమద్దుల గ్రామ రైతుల సమస్యను అత్యంత త్వరగా పరిష్కరించి, పంటలకు నీరు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. మంత్రి సానుకూల స్పందన పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ సభ్యులు ఈశ్వర్ రెడ్డి, రైతులు పూల చంద్రారెడ్డి, నాగ మల్లయ్య, శివారెడ్డి, చంద్రారెడ్డి మరియు గ్రామ రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.


# భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు చేస్తాం.!

**యువత ఆదర్శప్రాయుడు భగతసింగ్. -భగత్ సింగ్ ఆశయాలను సాధిస్తాం.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 23:** నంద్యాల పట్టణం సాయిబాబా నగర్ సమీపంలో ఉన్న పి.డి.ఎస్.యు కార్యాలయంలో సోమవారం సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల వర్ధంతి సందర్భంగా పి.డి.ఎస్.యు నంద్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగాపి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.యం.డి.రఫీ మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన వ్యక్తి సర్దార్ భగత్ సింగ్ అని స్వాతంత్రం మా జన్మహక్కుని బ్రిటిష్ పార్లమెంట్ మీద ఒక మందు గుండు బాంబును విసిరి తన నిరసన తెలిపిన వ్యక్తి భగత్ సింగ్ అని ఉద్ఘాటించారు.అత్యంత చిరుప్రాయంలో 22 ఏళ్ల వయసులో భారతదేశం కోసం తన ప్రాణాల సైతం లెక్కచేయకుండా ఉరి కంబాన్ని ముద్దాడిన విప్లవ వీర కిశోరాలు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, ఆశయాల కోసం పి.డి.ఎస్.యు నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. బ్రిటిష్ సామ్రాజవాదుల నుండి మాతృభూమి విముక్తి కోసం ఎందరో వీరులు తమ ప్రాణాలను తృణపాయంగా అర్పించారని, వారిలో అగ్ర ఘన్యులు కామ్రేడ్ భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ లని, 1931 మార్చి 23న బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వీరి ముగ్గురిని క్రూరంగా ఉరితీసారన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు నాడు ప్రవేశపెట్టిన మెకాలే విద్యా విధానమే నేటికీ కొనసాగుతుందన్నారు. విద్య సామాజిక అవసరాలకు కాకుండా కార్పొరేట్ కాషాయ శక్తుల అవసరాలకు అనుకూలంగా నేడు విద్యారంగాన్ని కాషాయ పాలకుల మారుస్తున్నారుని కేంద్ర 20 శాతం రాష్ట్ర బడ్జెట్ 30 శాతం జీడిపిలో 6శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా ఆ నిధులను కేటాయించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షైక్ షాహీద్, పట్టణ కార్యదర్శి లక్ష్మీకాంత్ ,నంద్యాల పట్టణ నాయకులు సుభాన్, హరి, నాయక్, కిరణ్, వినయ్, బాలాజీ, ధను, తదితరులు పోల్గొన్నారు.

# స్వర్గదామం లోనే చివరి మజిలీ.



**ఆంధ్ర ప్రగతి బండి ఆత్మకూరు మార్చి 23:** పుట్టిన ప్రతి వ్యక్తికి చివరి మజిలీ స్మశాన వాటిక అని వక్తలు పేర్కొన్నారు. సోమవారం బండి ఆత్మకూరు మండలంలోని చిన్నదేవలాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన స్వర్గ దామాన్ని గ్రామ సర్పంచ్ ఆవులపాటి మధుసూదన్ చౌదరి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల సురేష్ రెడ్డి ప్రారంభించారు. స్మశానంలో పరమేశ్వరుని విగ్రహం, దహన మండపం, మంచినీటి బోరు, నిర్మించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సొంత నిధులతో, దాతల సహకారంతో మరియు పంచాయతీ నిధులతో స్వర్గ ధామాన్ని నిర్మించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి పుణ్య కార్యక్రమాలకు ప్రతి ఒక్కరి సహకారం ఉండాలని సూచించారు ఈ కార్యక్రమంలో టీజీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల మనోహర్ చౌదరి,తాటికొండ బుగ్గరాముడు, కొరకంచి శంకర్, కొరకంచి లింగారెడ్డి శాఖమురు సుబ్బారెడ్డి,పెద్ద పుల్లయ్య,తిమ్మసారి నాగేశ్వరావు తదితరులు గ్రామ పెద్దలు,వివిధ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ చలివేంద్రం ప్రారంభం.

**ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా. ప్రారంభించిన డాక్టర్ జి. రవి కృష్ణ.**

**లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం: నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 23:**నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకుని బాలాజీ కాంప్లెక్స్ లో కళారాధన, దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద చలివేంద్రం ప్రారంభించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి కృష్ణ చలివేంద్రాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ, సోమేశుల నాగరాజు మాట్లాడుతూ ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని చల్లటి నీటిని ప్రజలకు అందుబాటులో ఉంచాలని చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడడం అవసరమన్నారు. అనవసరంగా నీటిని వృధా చేయకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. ప్రాణాధారమైన నీటిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీ వి రమణయ్య, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షు లు చంద్రమోహన్, సీనియర్ సభ్యులు మేడం చంద్రశేఖర్, రామయ్య, కళారాధన సభ్యుడు శివరామిరెడ్డి, నారాయణరెడ్డి, బాలచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుల సేవలు చిరస్మరణీయం.

**సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.**

**ఆంధ్ర ప్రగతి డోన్ మార్చి 23:** డోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి ఆధ్వర్యం లో మార్చి 23 న స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్ ,రాజ్ గురు సుఖదేవ్ గార్ల వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ.. మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు. 1)శ్రీ భగత్ సింగ్ 1907 సెప్టెంబరు 28 న జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుడు. ప్రఖ్యాత ఉద్యమకారుడు. ప్రజలను చైతన్య పరిచి విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చింది కూడా భగత్ సింగే. భారత స్వాతంత్ర్యోద్యమము లో పోరాడిన



అత్యంత ప్రభావశీల విప్లవకారులలో ఆయన ఒకడు. ఈ కారణంగానే షాహీద్ భగత్ సింగ్ గా కొనియాడబడ్డారు. ఈయన 1931 మార్చి 23 స్వర్గస్తులైనారు. 2) సుఖ్ దేవ్ థాపర్ 15 మే 1907 న జన్మించారు. భారత స్వాతంత్ర్య సమర ఉద్యమకారుడు. ఇతను భగత్ సింగ్ మరియు రాజ్‌గురు ల సహచరునిగా ప్రసిద్ధి. లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ ప్రభుత్వం పై పగతీర్చుకోవడానికి, ఫిరోజ్ పూర్ లో బ్రిటిష్ పోలీసు అధికారి "జె.పి. సాండర్స్" ను హతమార్చినందుకు గాను మార్చి 23 -1931 న ఉరితీయబడ్డాడు. 3) హరి శివరాంరాజ్ గురు ఆగష్టు 24, 1908 జన్మించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమకారుడు. మహారాష్ట్రలోని ఒక బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడు. ఇతను భగత్ సింగ్ మరియు సుఖ్ దేవ్ ల సహచరునిగా ప్రసిద్ధి. 1928 లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ వారిపై పగతీర్చుకోవడానికి, ఫిరోజ్ పూర్ లో బ్రిటిష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హతమార్చినందులకు గాను ఈ ముగ్గురు విప్లవకారులు భగత్ సింగ్ , రాజ్ గురు, సుఖ్ దేవ్ లను 1931 మార్చి 23 న లాహోరు సెంట్రల్ జైలులో ఉరి తీశారు. మన దేశం కోసం అతి చిన్న వయస్సు లోనే ప్రాణాలు త్యాగం చేసిన ఈ స్వాతంత్ర్య సమరయోధులను అనుక్షణం స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.


# భారత రాజ్యాంగాన్ని సుప్రీంకోర్టు తీర్పును

# అవమానించిన గరికపాటి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 23:** గరికపాటి నరసింహారావు బుర్ర తక్కువ ప్రవచనాలు మానండి అంటున్నారు ప్రజలు. స్కూల్లో మధ్యాహ్న భోజనాలు వద్దంటున్నావు. పైగా చదువుకునే పిల్లలకు మధ్యాహ్న భోజన పథకంలో గుడ్డు పెట్టడం ఎందుకు అంటున్నావ్..పేదల ఆకలి తెలియని వాళ్ళు ఇలానే మాట్లాడుతారు. ఆకలి బాధ పేదవాడికే తెలుసు ప్రవచనాలతో కాలయాపన చేసే గరికపాటి నరసింహారావు కి ఎలా తెలుస్తుంది? అంటున్నారు. మధ్యాహ్న భోజన పథకం ప్రాథమిక హక్కు అని తెలుసుకోవాలి.

ప్రభుత్వం తరఫున సలహాదారుడిగా ఉంటూ ప్రవచనాలు బోధించే గరికపాటి నరసింహారావు గారికి పేద విద్యార్థుల ప్లేటులో ఉన్న మధ్యాహ్నం భోజనం చూసి నైతిక విలువలు, క్రమశిక్షణ గుర్తొచ్చి ప్రవచనాలు బోధించాడు.ఇలాంటి వాళ్లను చూస్తుంటే సిగ్గుపడాలా? ఏడవలా? చీదరించుకోవాలా? అర్థం కాని పరిస్థితి. ఇదే దేశంలో మతం పేరుతో శతాబ్దాలుగా ప్రజలపై ఆధారపడి బ్రతికే వ్యవస్థలు కనిపించవా? పెద్ద పెద్ద కంపెనీలకు ట్యాక్స్ మాఫీలు, రాయితీలు ఇస్తే అది "ఆర్థికాఅభివృద్ధి" కులాలకు మతాలకు అతీతంగా స్కూల్లో పేద పిల్లలకు అన్నం పెడితే ఆధారపడటంమా? నా.? ఇది నైతికత కాదు ఇది ఒక స్పష్టమైన పక్షపాతం వైఖరి భారత సుప్రీంకోర్టు అనేకసార్లు ఆహారము,విద్య అనేవి "ప్రాథమిక హక్కులు" దానం కాదు అని స్పష్టంగా చెప్పింది. ఈ విషయాలు గరికపాటి నరసింహారావు కి తెలియవా.? లేదా తన కుల అహంకారాన్ని లేక మనువాదాన్ని బయటికి చాటుకున్నాడా? అంటూ చాలా చోట్ల ప్రజలు, విద్యావంతులు, చర్చించుకుంటున్నారు. స్కూల్లో చదువుకుంటున్న పిల్లలు ఆకలితో ఉండకుండా చేయడమే ప్రభుత్వాల నైతిక బాధ్యత అంటే ఇది ఉచిత కానుక, తాయిలం కాదు. అది ప్రాథమిక బాధ్యత ఇలాంటి కార్యక్రమాల వల్ల పాఠశాలల్లో డ్రాప్ ఔట్స్ శాతం తగ్గుతూ వస్తుంది. పేద విద్యార్థుల హక్కుల మీద నైతిక ఉపన్యాసాలు ఇచ్చే ముందు ప్రివిలేజ్ మీద అంటే ప్రత్యేక సౌకర్యము ప్రత్యేక హక్కు, విశేషాఅధికారాలతో నడుస్తున్న వ్యవస్థల మీద కూడా అదే మోరల్ చూపించండి. లేకపోతే అది మోరల్ కాదు అవుతుంది అంటే సొంత లాభం కోసం విలువలను మార్చుకొని కపట ప్రవర్తన అవుతుంది. ద్వందనీతి అవుతుంది. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని దేశవ్యాప్తంగా దళిత బహుజనులు హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా

భారత రాజ్యాంగ సభ ఆహార హక్కు పై రాజ్యాంగ నిబంధనలపై చర్చలు జరిపి మానవ గౌరవంతో జీవించే హక్కు ఆహారానికి రాజ్యాంగ హక్కుతో న్యాయశాస్త్రపరమైన పరిణామాలు సమాజానికి ఈ కేసు ద్వారా తెలియజేసింది. పియూసిఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు ద్వారా సుప్రీంకోర్టు సుమారు 25 సంవత్సరాల క్రితం కట్టుదిట్టమైన మధ్యంతరఉత్తర్వులు జారీ చేసింది. రాజ్యాంగ సభ చర్చల ద్వారా భారత రాజ్యాంగంలో ఆహార హక్కును ప్రాథమిక హక్కుగా పొందుపరిచింది. మన భారతదేశం 1947 వ సంవత్సరంలో బ్రిటిష్ వారి నుండి స్వాతంత్ర్యం పొందినప్పటికీ తన రాజ్యాంగ పరిషత్తులో రెండు సంవత్సరాలకు పైగా జరిగిన చర్చల అనంతరం 1950 వ సంవత్సరంలో మాత్రమే గణతంత్ర రాజ్యాంగాన్ని ఆమోదించింది. భారతదేశంలో ఉన్న పేదరికం మరియు అధిక స్థాయి అసమానతల దృష్ట్యా రాజ్యాంగంలో సామాజిక మరియు ఆర్థిక లేదా సామాజిక ఆర్థిక న్యాయాన్ని తప్పనిసరిగా ప్రస్తావించాలనే విషయములో ఎటువంటి సందేహం లేదు. తదనంతరం భారతదేశపు మొదటి ప్రధానమంత్రి అయిన జవహర్ లాల్ నెహ్రూ అసెంబ్లీ యొక్క మొదటి కర్తవ్యం ఒక " కొత్త రాజ్యాంగం ద్వారా భారతదేశానికి స్వేచ్ఛను అందించడం" ఆకలితో అలమటించే ప్రజలకు



అన్నం పెట్టడం, దిగంబరులకు వస్త్రాలు ఇవ్వడం, మరియు ప్రతి భారతీయుడు తనకు తాను అభివృద్ధి చేసుకోవడానికి పూర్తి అవకాశాన్ని కల్పించడం అని పేర్కొన్నారు. అయినప్పటికీ ఆహార హక్కు వంటి సామాజిక ఆర్థిక హక్కులను రాజ్యాంగంలో చేర్చారు. ఈ విషయాలన్నీ కూడా రాజ్యాంగ పరిషత్తు సభలో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు అదే విధంగా కొంతమంది సభ్యులు సామాజిక ఆర్థిక నిబంధనలను న్యాయస్థానంలో అమలు చేయగల హక్కుగా నిర్ణయించారు సామాజిక హక్కులు ముసాయిదాను రూపొందించారు అందులో జీవన వేతన హక్కు, మరియు మహిళలకు పిల్లలకు, రక్షణలో చేర్చబడ్డాయి ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ఆమోదించబడిన 10 సంవత్సరాల తర్వాత అమలులోకి వచ్చే విధంగా అన్ని ప్రధాన పరిశ్రమలను జాతీయం చేసే సామాజిక పథకానికి అనుకూలంగా చెప్పారు. భారతదేశంలో ఆహార హక్కు అనేది రాజ్యాంగబద్ధంగా రక్షించబడిన హక్కుగా పియూసిఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా 2001వ సంవత్సరం కేసులో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఆహార హక్కు అనేది జీవించే ప్రాథమిక హక్కులు ఒక భాగం అని భారత సుప్రీంకోర్టు ప్రకటించింది. 1980 సంవత్సరంలో మరియు 1990 వ సంవత్సరంలో సుప్రీంకోర్టు ఆర్టికల్ 21ను కేవలం ఇష్టానుసారంగా ప్రాణాలు తీయకుండా, కాపాడటానికి కాకుండా, గౌరవంగా జీవించే విస్తృత హక్కును కల్పించేలా కూడా ఈ కేసులో వ్యాఖ్యానించినది. అనేక కేసుల ఆధారంగా ఈ నిర్ణయం వెలువడింది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 37 ప్రకారం ఈ నిర్దేశక సూత్రాలు "ఏ న్యాయస్థానం చేత అమలు చేయబడవు"అని పేర్కొన్నప్పటికీ ఈ నిర్ణయం ద్వారా వాటిని ఆర్టికల్ 21 పరిధిలోకి తీసుకువచ్చి సమర్థ నియం చేసింది. ఈ మొద్యుల్ అంటే ఈ పెద్దవ్యవస్థ విద్యార్థులకు ఆహార హక్కుకు సంబంధించిన రాజ్యాంగ సభ చర్చల ద్వారా మరియు రాజ్యాంగ నిబంధనలను పరిచయం చేసింది ఆర్టికల్ 21 కింద గౌరవప్రదంగా జీవించే హక్కు పై భారత సుప్రీంకోర్టు కేసు చట్టాన్ని కూడా సమీక్షిస్తుంది అయితే పియూసిఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా 2001 వ సంవత్సరం ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పును అప్పటినుండి ఆహార హక్కు పై సుప్రీంకోర్టు జారీచేసిన ముఖ్యమైన ఉత్తర్వులను జారీ చేసినది. అయితే పియూసిఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా 2001 కేసులో గౌరవప్రదంగా జీవించే హక్కులో భాగంగా ఆహార హక్కును గుర్తించారు. దీనికి ప్రధాన కారణం ఆరు రాష్ట్రాలలో లక్షలాదిమంది భారత పౌరులను ప్రభావితం చేసిన కరువుకు ప్రతిస్పందనంగా దాఖలు చేసిన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం అంటే పిల్ ఈ కేసు ప్రారంభమైంది. సుప్రీంకోర్టు తన కొనసాగింపు మండమస్ అధికారాన్ని ఉపయోగించి ఈ కేసులో అనేక ఆహార సంబంధిత ఇతర సామాజిక ఆర్థిక సమస్యలకు సంబంధించిన విస్తృత శ్రేణి మధ్యంతర ఉత్తర్వులు అత్యంత ముఖ్యమైన ఉత్తర్వు 2001 నవంబర్ 28 న జారీ చేయబడినది. ఈ ఉత్తరువు ఆర్టికల్ 21 కింద ఆహారాన్ని ప్రాథమిక హక్కుగా ప్రకటించి మధ్యాహ్నం భోజన పథకంతో సహా అనేక పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాలను ఆదేశించింది తొలి ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసి 13 సంవత్సరాలు పైగా గడిచిన పియూసిఎల్ కేసు నేటికీ తెరిచే ఉంది మరియు 50 కి పైగా ఈ కేసులో మధ్యంతర ఉత్తర్వులు జారీచేయబడ్డాయి. అందుకు ప్రజాస్వామ్యవాదులు, మేధావులు గరికపాటి నరసింహారావుచేసిన వ్యాఖ్యలను ఖండించాలని ప్రజలు కోరుకుంటున్నారు.




డా.జి.బాలస్వామి
న్యాయవాది మరియు
ఫ్రీలాన్స్ జర్నలిస్టు


ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

# నిర్లక్ష్యం ప్రాణాలకే ప్రమాదం

## క్షయతో మూడు నిముషాలకో ఇద్దరు మృతి




**మార్చి 23 ఆంధ్ర ప్రగతి**
ఒకప్పుడు క్షయవ్యాధి సోకితే మరణం తప్పేది కాదు. కానీ ఆధునిక ప్రపంచంలో వైద్యశాస్త్రం అభివృద్ధి చెందడం, సకాలంలో వ్యాధిని గుర్తించి, మందులు ఇవ్వడం వల్ల, చికిత్స చేయడం వల్ల క్షయను అరికట్టడం సాధ్యమయ్యింది. అయినా నేటికీ మూడు నిముషాలకో ఇద్దరు క్షయవ్యాధితో మరణిస్తున్నారన్న గణాంకాలు చూస్తే భయమేస్తోంది. ఇది కేవలం నిర్లక్ష్యంతో పాటు, సకాలంలో వైద్యం చేయించుకోక పోవడం వంటి కారణాలని వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 24న పాటిస్తారు. టీబీ వ్యాధిపై అవగాహన పెంచడం, దాని నిర్మూలనకు కృషి చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. 1882లో డా. రాబర్ట్ కోచ్ టీబీ బాసిల్లస్ క్షయ వ్యాధి కారకంను కనుగొన్న రోజుగా దీనిని జరుపుకుంటారు. 1882, మార్చి 24న డా. రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను (మైకోబ్యాక్టీరియమ్ టూబరిక్లోసిస్) మొదటిసారిగా కనుగొన్నాడు. 1982లో అంతర్జాతీయ క్షయ, ఊపిరితిత్తుల వ్యాధుల వ్యతిరేక యూనియన్, రాబర్ట్ కోచ్ క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను కనుగొని 100 సంవత్సరాలైన సందర్భంగా మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం జరుపుకోవాలని ప్రతిపాదించింది.భయంకరమైన అంటువ్యాధైన టీబీ దేశంలో ప్రతి సెకనుకు ఒక్కరికి సోకుతున్నదని, ప్రతిరోజు దేశవ్యాప్తంగా 1000మంది క్షయ వ్యాధితో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962ను క్షయవ్యాధి నివారణకు ప్రత్యేకమైన చర్యలను తీసుకోవడం ప్రారంభించింది. క్షయవ్యాధి అనేది మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా వల్ల కలిగే అంటువ్యాధి. ఇది ప్రధానంగా ఊపిరితిత్తులపై దాడి చేస్తుంది. దగ్గు, తుమ్ముల ద్వారా గాలిలో వ్యాపిస్తుంది. 2 వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు, జ్వరం, రాత్రి చెమటలు మరియు బరువు తగ్గడం వంటివి దీని ప్రధాన లక్షణాలు. 6-9 నెలల పాటు డాక్టర్ పర్యవేక్షణలో మందులు వాడితే ఇది పూర్తిగా నయమవుతుంది. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుంది. కానీ మెదడు, మూత్రపిండాలు మరియు వెన్నెముక వంటి శరీరంలోని ఇతర భాగాలపై కూడా ఇది ప్రభావం చూపిస్తుంది. క్రియాశీల పల్మనరీ ఇన్ఫెక్షన్ ఉన్న వ్యక్తులే ఈ వ్యవధి వ్యాప్తికి మూలం. నిజానికి ప్రస్తుతం క్షయకు అత్యాధునిక చికిత్సలు, మందులు అందుబాటులో ఉన్నాయి. కానీ ప్రజలు క్షయ గురించి ఇంకా అవగాహన కలిగించకోవడం లేదని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని గుర్తించి సకాలంలో వైద్యం చేయించుకుంటే అటు వ్యక్తికే గాకుండా, సమాజా ఆరోగ్యానికి కూడా దోహదపడ్డవారు అవుతారు. 2016లో 10 లక్షల మంది చిన్నారులకు టీబీ సోకగా 2.5 లక్షల మంది పసివాళ్లు ప్రాణాలు కోల్పోయారంటే నమ్మశక్యం



కాని విషయం. ప్రపంచం లోనే వందలో 4వ వంతు జనాభాలో క్షయ బ్యాక్టీరియా ఉందంటే ఈ వ్యాధి ప్రభావం ఏ మేర వ్యాపించి ఉందో అర్థం చేసుకోవచ్చు. టిబి వ్యాధిగ్రస్తులు మిగతా దేశాలతో పోలిస్తే భారత్‌లోనే ఎక్కువని గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఆధునిక కాలంలోనూ భారత్ లో విస్తరిస్తున్న అనేక వ్యాధుల్లో ఈ క్షయ వ్యాధి ఒకటి. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులకు సంబంధించినదే అయిన చర్మం నుంచి మెదడు వరకు శరీరంలోని ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉంది. క్షయ వ్యాధి ముఖ్యంగా శ్వాసకోశాన్ని దెబ్బ తీస్తుంది. ఈ వ్యాధి బారినపడి ఇప్పటికీ ప్రతి సంవత్సరం అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ వ్యాధి సోకిన వ్యక్తి నుంచి గాలిలోకి విడుదలయ్యే సూక్ష్మ చుక్కల ద్వారా ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి సులభంగా వ్యాపిస్తుంది.క్షయ వ్యాధి సోకిన వారిలో దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రక్తంతో కూడిన దగ్గు, రాత్రిపూట చెమటలు పడుతుండడం మరియు కఫంలో రక్తం వంటి లక్షణాలు 2 వారాలకు మించి ఉంటాయి. ఎల్లప్పుడూ అలసిపోయినట్లు అనిపించడమే కాక, నొప్పి మరియు ప్రభావిత ప్రాంతాల్లో వాపు వస్తుంది. వ్యాధిగ్రస్తుల్లో శ్వాస ఆడకపోవడం, ఛాతి నొప్పి వంటి సమస్యలు కూడా సంభవిస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించి తుగ వైద్యసూచనలు పాటించాలి. లేకుండే ప్రాణాంతకంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారలోపం మరియు సిలికోసిస్ ఉన్నవారి లోనూ ఈ వ్యాధి సోకుతుంది. ప్రజల నిర్లక్ష్యం కారణంగా ప్రపంచంలోని మొత్తం కొత్త టీబీ కేసుల్లో మూడింట రెండు వంతులు ఎనిమిది దేశాల్లో ఉన్నాయి, భారత్ అగ్రస్థానంలో ఉంది. క్షయ నివారణ మరియు నివారించదగినదని వైద్యులు అంటున్నారు. వ్యాధి ఉన్న వ్యక్తి యొక్క అంటువ్యాధి అతను లేదా ఆమె గాలిలోకి విడుదల చేసే ట్యూబర్‌కిల్ బాసిల్లి సంఖ్యకు నేరుగా సంబంధం కలిగి ఉంటుంది. అనేక ట్యూబర్‌కిల్ బాసిల్లిని బహిష్కరించే వ్యక్తులు తక్కువ లేదా బాసిల్లిని బహిష్కరించే రోగుల కంటే ఎక్కువ అంటువ్యాధి కలిగి ఉంటారు.సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకుంటే, సక్రమంగా మందులు వాడితే వ్యాధిని అదుపు చేయవచ్చని అంటున్నారు. జీవనశైలి మార్పులు కూడా ఈ కాలంలో వ్యాధిని నిర్మూలిం చడంలో సహాయపడతాయి. క్షయ అనేది చికిత్స చేయగల మరియు నయం చేయగల వ్యాధి.

సమయానికి మందులను తీసుకోవడం వల్ల రక్తంలో ఔషధం యొక్క ఖచ్చితమైన ఏకాగ్రత స్థాయిని కొనసాగించవచ్చు. వ్యాధికారక క్రిములను చంపడానికి ఇది చాలా అవసరం. చాలా మంది రోగులు చికిత్స కొనసాగుతుండగా మెరుగైన పరిస్థితి కనిపించడంతో, అటువంటి రోగులు కొన్నిసార్లు చికిత్స చేస్తున్న వైద్యుడిని సంప్రదించకుండా వారి స్వంత చికిత్సను ఆపడానికి ఆకర్షితులవుతారు. ఇది హానికరం మరియు మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ క్షయవ్యాధి అభివృద్ధికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. చికిత్స సమయంలో ధూమపానం మరియు మద్యపానం చేయవద్దు. మీరు మందులు తీసుకునేటప్పుడు ధూమపానం చేస్తే, అది మీ చికిత్సను ప్రభావితం చేయవచ్చని కూడా వైద్యులు హెచ్చరిస్తున్నారు. చికిత్సకు కొన్ని మందులు కాలేయానికి హాని చేస్తాయి. వీటిని తీసుకుంటూ మద్యం సేవించడం వల్ల కాలేయంపై అదనపు భారం పెరుగుతుందని అంటున్నారు. ఏదేమైనా చికిత్స చేయించుకోవడం, వ్యాధిని గుర్తించడం, వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడడం వంటి వాటి వల్ల వ్యాధిని అరికట్ట వచ్చని అంటున్నారు. కేంద్రం కూడా క్షయ నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది.

# డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పార్టీలకు ప్రచారం

## దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో ఉచిత ప్రసారం -కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ,మార్చి 23 ఆంధ్ర ప్రగతి**
నాలుగు అసెంబ్లీ ఎన్నికల వేళ భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం కోసం డిజిటల్ వోచర్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో మాత్రమే ఈ ఉచిత ప్రసార అవకాశం ఉంటుంది. త్వరలో అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ ఉచిత ప్రసార అవకాశం కల్పించింది.ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని 39ఏ సెక్షన్ కింద రాజకీయ పార్టీలకు ఈ అవకాశం కల్పిస్తున్నట్టు ఈసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు ఐటీ ఎ÷-లాట్‌ఫాం ద్వారా ఈ డిజిటల్ టైమ్ వోచర్లు జారీ చేస్తున్నట్టు పేర్కొంది. ఈ బ్రాడ్‌కాస్ట్ విండో అభ్యర్థుల జాబితా విడుదలైన తేదీ నుంచి ప్రారంభమై పోలింగ్‌కు రెండ్రోజుల ముందు వరకూ కొనసాగుతుందని తెలిపింది. రాష్ట్ర/యూటీ స్థాయిలో పారదర్శకంగా డ్రా నిర్వహించడం ద్వారా బ్రాడ్‌కాస్ట్ స్లాట్‌లు నిర్ధారిస్తారు. ప్రతి పార్టీకి దూరదర్శన్, అల్ ఇండియా రేడియాలో 45 నిమిషాల ఉచిత ప్రసార సమయం కేటాయిస్తారు. గత అసెంబ్లీ సమయంలో పార్టీల పనితీరు ఆధారంగా కూడా అదనపు ప్రసార సమయం కేటాయించే వీలుంటుంది. సాంకేతిక, రెగ్యులేటరీ ప్రమాణాలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు ట్రాన్స్‌క్రిప్టులు, రికార్డింగ్‌లను ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. ఆయా రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను సమష్టిగా వ్యక్తం చేసేందుకు వీలుగా ప్రసార భారతి ప్యానల్ డిస్కషన్లు, డిబేట్లను కూడా నిర్వహిస్తుంది. చిత ప్రసార సమయం కేటాయింపు ద్వారా రాజకీయ పార్టీలు తమ విధానాలను, ప్రచారాన్ని ప్రజల్లోకి సులభంగా తీసుకువెళ్లవచ్చని ఈసీఐ భావిస్తోంది. ఇది ఎన్నికల పక్రియలో పారదర్శకతను పెంచి, సమాన అవకాశాలు కల్పించే డిజిటల్ చొరవగా పేర్కొంటోంది. ఇటీవల ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించింది. కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఒకే దశలో ఏప్రిల్ 9న పోలింగ్ జరుగనుండగా, తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగుతుంది. పశ్చిమబెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ ఉంటుంది. నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో మే 4న ఫలితాలు వెలువడతాయి.

# ఐకానిక్ టవర్‌గా అసెంబ్లీ నిర్మాణం

## మంత్రి నారాయణ వెల్లడి

**అమరావతిమార్చి 23 ఆంధ్ర ప్రగతి**



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులపై రాష్ట్ర మున్సిపల్, పరిపాలన శాఖ మంత్రి పొంగూరు నారాయణ కీలక అప్‌డేట్స్ ఇచ్చారు. అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఐకానిక్ కట్టడాలుగా నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల విశిష్టతను, నిధుల సమీకరణను మంత్రి నారాయణ వివరించారు. అమరావతి అసెంబ్లీ భవనాన్ని 250 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ భవనంపైకి ప్రజలు వెళ్లి మొత్తం అమరావతి నగరాన్ని వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని ఉత్తమ అసెంబ్లీ భవనాల్లో ఒకటిగా ఇది నిలుస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ, హైకోర్టుతో పాటు మరో ఐదు ఐకానిక్ టవర్లను అత్యద్భుతంగా నిర్మిస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఐకానిక్ భవనాలు కాబట్టి సాధారణ భవనాల కంటే వీటికి ఖర్చు కొంత ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోని ఐకానిక్ భవనాల రేట్లతో పోల్చి వీటిని చూస్తున్నామని, ఎస్ఆర్ రేట్ల ప్రకారం నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాజధాని పనుల కోసం భారీ ఎత్తున నిధులను ప్రభుత్వం సమకూర్చుకుంటోందని మంత్రి నారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 15 వేల కోట్లు, హడ్కో ద్వారా మరో రూ. 11 వేల కోట్లు సమకూర్చుకుంటున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

# అడవులు, వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత:డీఆర్వో




**ఆంధ్ర ప్రగతి మహానంది మార్చి 23:**
వన్య ప్రాణుల సంరక్షణ, అడవుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మహానంది డీఆర్వో హైమావతి పేర్కొన్నారు. ఆదివారం మహానందిలోని పర్యావరణ కేంద్రంలో హైదరాబాద్ కన్జర్వేషన్ సొసైటీ రీజనల్ ఆర్గనైజర్ శ్రీధర్,మనోజ్ ఆద్వర్యంలో మానవునికి-జంతువుల మధ్య సంఘర్షణలు తొలగించడం, అడవిలో అగ్ని ప్రమాదాలను నివారించడం అంశాలపై పలు గ్రామాల ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.డీఆర్వో మాట్లాడుతూ.. అడవుల పెంపుదలకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అడవులు సమృద్ధిగా ఉంటేనే అందులో అటవీ జంతువులు సమృద్ధిగా నివసిస్తాయని, వర్షాలు కూడా సకాలంలో కురుస్తాయన్నారు. అడవుల్లో ప్రమాదవశాత్తు ఏవైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే అటవి శాఖ అధికారులకు, సిబ్బందికి సమాచారం అందజేయాలన్నారు. ప్రజలు అటవీ ప్రాంతాల్లో కాల్చిన సిగరెట్, బీడీలు, మంటలకు సహకరించే వస్తువులు పడే రాదని చెప్పారు.అడవుల్లో చెట్లను కొట్టవద్దని, వన్య ప్రాణులను సంరక్షించాలని, వేట సాగించవద్దన్నారు. ఎవరైనా జంతువులకు హాని తలపెడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ రామకృష్ణ,సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# భగత్ సింగ్,రాజ్ గురు,సుఖదేవ్ స్ఫూర్తితో డ్రగ్స్ పై పోరాటం.




**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ మార్చి 23:**భారతి విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఎద్దుల పాపమా హైస్కూల్ లో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల చిత్రపటాలకి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా స్కూల్ ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, ప్రభాకర్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ ఆళ్లగడ్డ మండల్ కార్యదర్శి లతీఫ్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టి ఉరికంబుమెక్కిన యువకిశోరం భగత్ సింగ్,రాజ్ గురు,సుఖదేవ్ ల వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేస్తూ డ్రగ్స్ పై విస్తృతమైన పోరాటం చేయాలని నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని విద్యార్థులు యువజనలు అభ్యుదయ శక్తులు పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ కేంద్రంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు కార్పొరేట్ కాలేజీల్లో స్కూల్స్ ఉన్న సమస్యలపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు చేస్తామని తెలిపారు .శాస్త్రీయ విద్య కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ చదువు పూర్తి అయిన అందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. చదువుతూ పోరాడు- చదువుకై పోరాడు అనే నినాదంతో పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ ని బలోపేతం చేయడానికి విద్యార్థులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు.కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మనువాదాన్ని తీసుకొస్తూ భవిష్యత్తు విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నదని దానికి వ్యతిరేకంగా విద్యార్థుల ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కాలేజీల్లో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఫీజులు అత్యధికంగా తల్లిదండ్రులు దగ్గర్నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారని అలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యా అధికారులు ఏమాత్రం పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోకపోతే ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భాష, బషీర్,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కేసులో 'నా కుమారుడు నిరపరాధి'

## మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



**కడప,మార్చి 23 ఆంధ్ర ప్రగతి** డ్రగ్స్ కేసులో 'నా కుమారుడు నిరపరాధి' అని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. తెలంగాణ రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు వివాదంపై కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం కడప జిల్లాలో మీడియాతో ఆయన మాట్లాడారు. తన కుమారుడు, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ డ్రగ్స్ కేసులో చిక్కుకోవడంపై క్లారిటీ ఇచ్చారు. మొయినాబాద్ ఫాంహౌస్ ఘటనపై సుధాకర్ యాదవ్ స్పందించారు. తన కుమారుడిపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మొయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన పార్టీకి ఎంపీ మహేశ్‌కుమార్ యాదవ్ వెళ్లిన మాట నిజమేనని పుట్టా సుధాకర్ యాదవ్ అంగీకరించారు. అయితే, తన కుమారుడికి ఎలాంటి చెడు అలవాట్లు లేవని, ముఖ్యంగా డ్రగ్స్ తీసుకునే అలవాటు అస్సలు లేదని స్పష్టం చేశారు. మహేశ్ వద్ద నుంచి కనీసం బ్లడ్ శాంపిల్స్ తీసుకోకుండానే రిపోర్టులో పాజిటివ్ అని ఎలా నిర్ధారిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ నిర్ధారణ పక్రియపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను తెలుగుదేశం పార్టీ అధిష్ఠానానికి సమర్పించినట్లు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వెల్లడించారు. పోలీసుల విచారణ ఇంకా కొనసాగుతోందని, ఇన్వెస్టిగేషన్ ముగిశాక అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. పోలీసుల విచారణ పూర్తయిన తర్వాత, మహేశ్ నిరపరాధి అని నిరూపించే అన్ని ఆధారాలతో మీడియా ముందుకు వస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు.